సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 28 । మే । 2024



రూ.1,01,116 విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి లంక వేంకట రమణ దంపతులు (తిమ్మాపురం అడ్డురోడ్డు) సోమవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.



అన్నదాన భవన నిర్మాణానికి..

ఆత్రేయపురం: వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రంలో అన్నదాన భవన నిర్మాణానికి శ్రీమంత్ర వాడి నాగమహేశ్వరి (అంబాజీపేట) సోమవారం రూ.51,116 విరాళం సమర్పించారు.

గరిష్ఠం/కనిష్ఠం 42.0°/28.7°

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమహేంద్రవరం	42.0	31.0
కాకినాడ	37.0	28.7
అమలాపురం	41.0	30.0

న్యూస్‌రీల్

సర్టిఫికెట్ల పరిశీలనకు 65 మంది హాజరు



సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న జిల్లా అసిస్టెంట్ కో ఆర్డినేటర్ జగన్‌మోహనరావు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నిర్వహించిన పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలనకు 65 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. పాలిసెట్ జిల్లా కో ఆర్డినేటర్, కళాశాల ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు ఈ విషయం తెలిపారు. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం 8.30 గంటలకే హెల్ప్ లైన్ కేంద్రం ప్రారంభించామన్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం విద్యార్థులకు ధ్రువీకరణ పత్రం అందజేశామని తెలిపారు. మంగళవారం 12,001 నుంచి 27,000 వరకూ ర్యాంకు పొందిన విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని నాగేశ్వరరావు తెలిపారు.

15 అంగన్‌వాడీ కేంద్రాల్లో 'క్రిస్ప్'



క్రిస్ప్ ప్రాజెక్టుపై సమీక్షిస్తున్న కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం రూరల్: అంగన్‌వాడీ ప్రీ స్కూలులో బోధన బోధనేతర విధానాలను బలోపేతం చేసేందుకు రాజమహేంద్రవరం అర్బన్, రాజానగరం మండలాల్లోని 15 అంగన్‌వాడీ కేంద్రాలను సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ (క్రిస్ప్) ప్రాజెక్టుకు ఎంపిక చేశారని కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో మాజీ ఐఏఎస్ అధికారి ఎం.మురళి ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. క్రిస్ప్ ప్రాజెక్ట్ ద్వారా ఈ 15 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు పెంచుతారన్నారు. మురళి మాట్లాడుతూ, జిల్లాలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాలతో పాటు రంపచోడవరం వంటి గిరిజన ప్రాంతాల్లో క్రిస్ప్ ప్రాజెక్ట్‌ను ఏడాది పాటు ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని, వాటి ద్వారా వచ్చిన ఫలితాలను అధ్యయనం చేసి, రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్ట్ అమలుకు ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికార అధికారి కె.విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

సత్యదేవుని ఆలయానికి భక్తుల తాకిడి

అన్నవరం: సత్యదేవుని దర్శనానికి సోమవారం వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. సుమారు 40 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. స్వామివారి ఉచిత దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టింది. ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూ లైన్లు అన్నీ భక్తులతో నిండిపోయాయి. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు 2,100 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

బడి తెరిచేలోపే కానుక

- సిద్ధమవుతున్న జగనన్న విద్యా కానుక కిట్లు
- ఐదో విడత పంపిణీకి రంగం సిద్ధం
- 1.03 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి
- జిల్లాకు 9.40 లక్షల పుస్తకాల అవసరం



మండల కేంద్రం పెరవలిలో పాఠ్య పుస్తకాలు చూపుతున్న సిబ్బంది



చాగల్లు మండల కేంద్రంలోని స్టాక్ పాయింట్‌కు విద్యా కానుక సామగ్రిని తరలిస్తున్న అధికారులు

సాక్షి, రాజమహేంద్రవరం: పిల్లలకు మనం ఇచ్చే ఆస్తి చదువేనని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తరచూ చెబుతూ ఉంటారు. విద్యతోనే ప్రతి ఒక్కరికీ సమాజంలో గుర్తింపు లభిస్తుందని నమ్మి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆ చదువులకు నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులు దూరం కాకూడదన్నదే ఆయన ఆశయం. ఇందుకు అనుగుణంగానే విద్యా రంగంలో సమూల మార్పులకు నాంది పలికారు. మన బడి నాడు–నేడు కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. జగనన్న అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెన వంటి వినూత్న కార్యక్రమాలతో పేద విద్యార్థుల చదువులకు అండగా నిలిచారు.

సామాన్యులపై భారం పడకుండా..

ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపేద, మధ్య తరగతి విద్యార్థులే అత్యధికంగా చదువుతూంటారు. తల్లిదండ్రులు రెక్కలు ముక్కలు చేసుకునేలా శ్రమ పడుతూ మరీ తమ పిల్లలను బడికి పంపుతూంటారు. అటువంటి తల్లిదండ్రులకు విద్యా సంవత్సరం ఆరంభంలో తమ బిడ్డల చదువులకు అవసరమయ్యే పుస్తకాలు, యూనిఫాం, ఇతర సామగ్రి కొనుగోలు చేయడం తలకు మించిన భారమే అవుతుంది. వారిపై ఆ భారం పడకుండా ఉండేందుకే సీఎం వైఎస్ జగన్ జగనన్న విద్యా కానుక పథకానికి రూపకల్పన చేశారు. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగులు, బెల్టులు తదితర సామగ్రితో జగనన్న విద్యాకానుక పేరిట ఏటా కానుక అందిస్తున్నారు. పాఠశాలలు తెరవక ముందే వీటిని అందుబాటులో ఉంచుతున్నారు. బడి గంట మోగిన వెంటనే విద్యార్థులకు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. నాలుగేళ్లుగా ఈ ప్రక్రియ నిరాటంకంగా జరిగింది. అదేవిధంగా ఐదో విడత కూడా జగనన్న విద్యా కానుక కిట్లను విద్యా సంవత్సరం ప్రారంభమయ్యేలోగా సిద్ధం చేసేందుకు విద్యా శాఖ అధికారులు ముమ్మరంగా కసరత్తు చేస్తున్నారు.

విద్యార్థులకు అవసరమైన సామగ్రి ఇలా...

సామగ్రి రకం	ఆవశ్యకత
నోట్ పుస్తకాలు	7,08,822
బ్యాగులు	1,03,422
యూనిఫాం	1,03,422
బూట్లు	1,04,856
బెల్ట్	68,298
ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ	12,338
పిక్టోరియల్ డిక్షనరీ	5,988

ముందస్తుగా రెడీ

సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా విద్యార్థులు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా అసౌకర్యానికీ గురి కాకూడదనే తలంపుతో 2024–25 విద్యా సంవత్సరానికి అవసరమైన విద్యా కానుక కిట్లు ముందస్తుగా సిద్ధం చేసింది. జిల్లాకు అవసరమైన పుస్తకాలు, బూట్లు, బెల్టులు తదితర సామగ్రి ఇండెంట్ తీసుకుని, వాటి సరఫరాకు చర్యలు తీసుకుంది. ఫలితంగా ఆయా మండలాల్లోని స్టాక్ పాయింట్లకు జగనన్న విద్యా కానుక కిట్ల సరఫరా ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని గోదాముకు నోట్ బుక్స్ రావడం ఏప్రిల్‌లోనే మొదలైంది. వచ్చే నెల మొదటి వారానికి ఈ సామగ్రి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తుందని విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లా వ్యాప్తంగా 986 ప్రభుత్వ పాఠశాలల్లో 1,03,422 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో బాలురు 49,348, బాలికలు 54,074 మంది ఉన్నారు. వీరికి ఒకటి నుంచి పదో తరగతి వరకూ అన్ని టైటిల్స్ కలిపి 9,40,985 పాఠ్య పుస్తకాల ఆవశ్యకత ఉంది. ఇప్పటికే మండలాల్లోని స్టాక్ పాయింట్లకు 5,77,901 పాఠ్య పుస్తకాలు సరఫరా అయ్యాయి. మిగిలిన 3,63,084 పుస్తకాలు వారం రోజుల్లో సమకూరే అవకాశం ఉందని విద్యా శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. విద్యార్థులకు బెల్టులు పూర్తి స్థాయిలో 68,298 సరఫరా అయ్యాయి. జగనన్న విద్యా కానుకలో భాగంగా పాఠ్య పుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాం, బూట్లు, బెల్టులు, ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీ తదితర సామగ్రి అందజేయనున్నారు.

స్టాక్ పాయింట్లకు..

ఈ విద్యా సంవత్సరం పాఠ్య పుస్తకాల సరఫరాలో రెండు పద్ధతులు అవలంబిస్తున్నారు. 1 నుంచి 7వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాలు, వర్క్ బుక్స్‌ను నేరుగా పుస్తక గోదాం నుంచి జిల్లా స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు. ప్రభుత్వ అనుమతితో 8, 9, 10వ తరగతుల పాఠ్య పుస్తకాలను ప్రింటింగ్ ప్రెస్‌ల నుంచి నేరుగా మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేస్తున్నారు. ఈ ఏడాది పాఠ్య పుస్తకాలను మరింత ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. కవర్ పేజీలు ఆకర్షణీయంగా తయారు చేసి, క్యూఆర్ కోడ్ ముద్రించారు. తద్వారా పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారం పొందే వెసులుబాటు విద్యార్థులకు కలుగుతుంది.

చిన్నారులపై పుస్తకాల బరువు లేకుండా..

విద్యా బోధనలో ప్రభుత్వం సెమిస్టర్ విధానాన్ని అమలు చేస్తోంది. గత ఏడాది ఒకటి నుంచి 9వ తరగతి వరకూ సెమిస్టర్ విధానాన్ని అమలు చేయగా.. ఈ ఏడాది పదో తరగతిలో సైతం ఈ పద్ధతి తీసుకుని వచ్చింది. ఇందులో భాగంగా గణితం, సైన్స్ సబ్జెక్టులను రెండు సెమిస్టర్లుగా విడదీశారు. సిలబస్ మొత్తాన్ని జూన్ నుంచి అక్టోబర్ వరకూ సెమిస్టర్–1గా, నవంబర్ నుంచి మార్చి వరకూ సెమిస్టర్–2గా విభజించారు. దీంతో పాటు 1 నుంచి 10వ తరగతి వరకూ పాఠ్య పుస్తకాలు బైలింగ్వల్ విధానంలో ముద్రిస్తున్నారు. ఒక పేజీలో ఇంగ్లిష్, మరో పేజీలో తెలుగులో పాఠ్యాంశం ముద్రించడం ద్వారా విద్యార్థులు సులువుగా అర్థం చేసుకోగలుగుతున్నారు.

ప్రతి విద్యార్థికీ కానుక



ప్రతి విద్యార్థికీ ఐదో విడత విద్యా కానుక కిట్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాకు వచ్చిన కిట్లను ఆలస్యం లేకుండా వెంటనే మండల కేంద్రాల్లోని స్టాక్ పాయింట్లకు పంపుతున్నాం. పాఠ్య పుస్తకాలు, బెల్టులు ఇప్పటికే అందాయి. మిగిలిన సామగ్రి సైతం జూన్ మొదటి వారంలోపు అందే అవకాశం ఉంది. పాఠశాలలు తెరచిన రోజునే విద్యార్థులకు కిట్లు అందజేసేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటున్నాం.

– సిరిపురపు సుభాషిణి, అదనపు ప్రాజెక్టు కో ఆర్డినేటర్, సమగ్ర శిక్ష, రాజమహేంద్రవరం

కౌంటింగ్ కేంద్రంలో నిబంధనలు పాటించాలి

- అనుమతి ఉన్న వారికే ప్రవేశం
- మూడంచెల భద్రతా ఏర్పాట్ల పూర్తి
- జిల్లా ఎన్నికల అధికారి మాధవీలత



కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): ఓట్ల లెక్కింపు ప్రారంభం నుంచి పూర్తయ్యేంత వరకూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని, నియమ నిబంధనలు కచ్చితంగా పాటించాల్సిందిగా సిబ్బందిని ఆదేశించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చి, అవగాహన కల్పించామని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియపై కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, కమిషనర్లు జ్ఞానేశ్‌కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధు ఢిల్లీ నుంచి సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కౌంటింగ్ సిబ్బందికి తొలి దశ శిక్షణ నిర్వహించామన్నారు. రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రంలోకి ఎన్నికల విధుల్లో భాగస్వాములయ్యే సిబ్బందిని, కౌంటింగ్ సిబ్బందిని, ఎన్నికల కమిషన్ గుర్తింపు కార్డులు జారీ చేసిన వారిని, అభ్యర్థులను, వారి ఏజెంట్లను మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. నియోజకవర్గాల వారీగా గుర్తింపు కార్డులకు కలర్ కోడ్ ఇస్తున్నామని, వారిని తప్ప కౌంటింగ్ హాలులోకి ఇతరులను అనుమతించబోమని తెలిపారు. దీనిపై రాజకీయ పార్టీలకు, అభ్యర్థులకు, ఏజెంట్లకు ఇప్పటికే అవగాహన కల్పించామన్నారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, సీసీ కెమెరాలు, నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని, కమాండ్ కంట్రోల్ రూము ద్వారా పర్యవేక్షిస్తున్నామని వివరించారు. యూనివర్సిటీ ఆవరణను నో స్మోకింగ్ జోన్‌గా ప్రకటించామని, కిలోమీటర్ పరిధిలో 144 సెక్షన్ అమలు చేస్తున్నామని చెప్పారు. ఓట్ల గోప్యతను పాటించడంలో భాగంగా కౌంటింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ చేపట్టడం లేదని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా వచ్చే నెల 2న కౌంటింగ్ ట్రయల్ రన్‌కు ఏర్పాట్లు చేశామని కలెక్టర్ మాధవీలత చెప్పారు.

కాలం చెల్లిన మందులతో కాసుల వేట

- కొరడా ఝళిపించిన డ్రగ్స్ అధికారులు
- రాజమహేంద్రవరంలో మందుల దుకాణం లైసెన్స్ రద్దు
- పలు షాపుల్లోనూ ఇదే తంతు
- డిస్కౌంట్ పైనే వినియోగదారుల దృష్టి
- అదే అదనుగా కొన్నిచోట్ల ఎక్స్‌పైరీ మందుల విక్రయం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): దుస్తులో.. మోటార్ సైకిలో.. కారో.. గృహోపకరణ వస్తువో కొందామని మార్కెట్‌కు వెళ్తే.. ఆన్‌లైన్ షాపింగ్ చేస్తే.. డిస్కౌంట్ ఎంత వస్తుందనే ప్రతి ఒక్కరూ చూస్తారు. ఇది సగటు వినియోగదారుని బలహీనత. వారిని ఆకర్షించేందుకు కొంతమంది వ్యాపారులు అనుసరించే సూత్రం కూడా ఇదే. దీనిని అవకాశంగా తీసుకుని కొంతమంది వ్యాపారులు నాణ్యతకు తిలోదకాలు ఇస్తూంటారు. ఇది మామూలు వస్తువుల వరకూ అయితే వినియోగదారుకు ఆర్థికంగా మాత్రమే నష్టం కలుగుతుంది. అదే మందుల విషయంలో అయితే..! ఏకంగా ఆరోగ్యానికే ముప్పు వస్తుంది. ఒక్కోసారి ప్రాణాల మీదకు కూడా వస్తుంది. చాలా మంది వినియోగదారులు ఏ షాపులో ఎంత డిస్కౌంట్ ఇస్తున్నారనేదే చూస్తున్నారు తప్ప.. మందుల నాణ్యత, కాలపరిమితి వంటివి గమనించడం లేదు. ఈ చిన్నపాటి తప్పిదమే వారికి ప్రమాదకర పరిస్థితుల్లోకి నెడుతోంది.

'ఎక్స్‌పైరీ'పై దృష్టి పెట్టాల్సిందే..

కాలం చెల్లిన మందులు విక్రయించారంటూ ఓ బాధితుడు ఇటీవల రాజమహేంద్రవరంలోని లైఫ్ మందుల దుకాణంపై ఫిర్యాదు చేశారు. దీనిపై ఔషధ నియంత్రణ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నాగమణి రంగంలోకి దిగారు. ఆ ఫిర్యాదులోని ఆరోపణలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో ఆ దుకాణం లైసెన్స్‌ను వారం రోజుల పాటు సస్పెండ్ (తాత్కాలిక రద్దు) చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ఒక్క దుకాణమే కాదు. అధికారులు పకడ్బందీగా దాడులు చేస్తే ఇతర మందుల దుకాణాల్లో సైతం ఇటువంటి 'ఎక్స్‌పైరీ' వ్యవహారాలు బయటపడతాయి. సాధారణంగా దుకాణదారులు తమ వద్ద ఉన్న మందుల్లో కాలం చెల్లిన వాటిని ముందుగానే గుర్తించి, పక్కన పెట్టేస్తారు. కానీ, వీటితో కూడా కాసుల వేట సాగించాలనుకునే వ్యాపారులు మాత్రం స్ట్రిప్‌లో ఎక్స్‌పైరీ తేదీ ఉన్న భాగాన్ని కట్ చేసి, మిగిలిన మాత్రలను దర్జాగా విక్రయిస్తున్నారు.

యథేచ్ఛగా మత్తు మందుల విక్రయాలు

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 4,200 రిటైల్, 1,300 హోల్‌సేల్ కలిపి మొత్తం 5,500 మందుల దుకాణాలున్నాయి. కొంత మంది వ్యాపారులు నిబంధనలు తుంగలో తొక్కి మరీ ఇష్టానుసారం మత్తు మందులు సైతం విక్రయించేస్తున్నారు. ఉదాహరణకు ఆల్‌ప్రోజలమ్ వంటి మత్తు మందులను వైద్యుని చీటీ లేకుండా విక్రయించకూడదు. అలాగే హెచ్1 డ్రగ్స్ కూడా వైద్యుల చీటీ మేరకే ఇవ్వాలి. కానీ, ఇటువంటి మందులను పలు దుకాణాల్లో యథేచ్ఛగా అమ్మేస్తున్నారు. చాలా మంది జ్వరం, కడుపునొప్పి వంటి ఇబ్బందులు తలెత్తినప్పుడు ఇంటి సమీపాన ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి, రోగ లక్షణాలు చెప్పి, దుకాణదారు ఇచ్చే మందులు తెచ్చి వేసుకుంటారు. ఆ మందులు ఎవరు తయారు చేశారనే వివరాలు ఆ మందులపై ముద్రించి ఉండవు. అటువంటి మందులు వేసుకోవడం వల్ల ఇబ్బంది తాత్కాలికంగా తగ్గినా కిడ్నీ, లివర్ వంటి శరీర అవయాలపై దుష్ప్రభావాలు ఎక్కువగా ఉంటాయి. ఆయా వ్యాపారులు కూడా డాక్టర్ చీటీ లేకుండానే నాసిరకమైన, కాలం చెల్లిన మందులు యథేచ్ఛగా విక్రయించేస్తున్నారు. ఇదంతా బహిరంగ రహస్యమే అయినప్పటికీ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ సరిగ్గా లేకపోవడంతో స్వార్థపరులైన వ్యాపారులు బరితెగిస్తున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు నిత్యం ఎన్ని దుకాణాలకు వెళుతున్నారు, ఎన్ని తనిఖీలు చేస్తున్నారు, ఎన్ని కేసులు నమోదు చేస్తున్నారనేది సరైన జవాబు దొరకని ప్రశ్నగానే మిగిలిపోతోంది.





డ్రగ్స్ అధికారులు తాత్కాలికంగా లైసెన్సు రద్దు చేసిన మందుల దుకాణం

అలా తెలిసింది

మా వదిన శ్రీదేవి గర్భిణి కావడంతో వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడుతున్నాం. ఆమెకు కవలలని వైద్యులు చెప్పారు. డాక్టర్ రాసిచ్చిన మందులు లైఫ్ మందుల స్టోర్‌లో కొనుగోలు చేశాను. వాటిలో ప్రొజెస్టిరోన్ మందులున్నాయి. అవి వేసుకున్నాక మా వదినకు వాంతులు, కొంత ఇబ్బంది రావడంతో వెంటనే వైద్యుని సంప్రదించాం. మేం కొన్న మందులు వేసుకున్నాక ఇలా అవడంతో వెంటనే వాటిపై ఎక్స్‌పైరీ తేదీ చూశాము. ప్రొజెస్టిరోన్ మందులపై ఎక్స్‌పైరీ తేదీ అయిపోయింది. అది తెలియక వేసుకోవడంతో ఆ మందులు రక్తంలో కలిసిపోయాయి. దీనివల్ల ఏం ప్రమాదం ఎదురవుతుందోనని భయంగా ఉంది. దీనిపై డ్రగ్స్ అధికారులకు ఫిర్యాదు చేశాను.

– పాలమరశెట్టి వెంకటేశ్వరరావు, కొంతమూరు

ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు



మందుల అమ్మకాల్లో నిబంధనలు పాటించకుంటే ఎంతటి వారైనా సరే ఉపేక్షించేది లేదు. రాజమహేంద్రవరంలోని లైఫ్ మందుల దుకాణంపై ఫిర్యాదు రావడంతో వెంటనే దాడి చేసి, వివరాలు సేకరించాం. ఎక్స్‌పైరీ మందులు విక్రయించారనే కోణంలో ఆ దుకాణం లైసెన్స్‌ను తాత్కాలికంగా వారం రోజులు రద్దు చేశాం. మందుల దుకాణదారులు బాధ్యతగా వ్యవహరించాలి. వినియోగదారునికి అవసరమైన, నాణ్యమైన మందులు ఇచ్చి వారి నమ్మకాన్ని చూరగొనాలి. లేకపోతే చర్యలు తప్పవు. మందుల దుకాణాలపై తనిఖీలు ముమ్మరం చేశాం. డ్రగ్ ఇన్‌స్పెక్టర్లకు ఆదేశాలు జారీ చేశాం.

– నాగమణి, అసిస్టెంట్ డైరెక్టర్, ఔషధ నియంత్రణ శాఖ, రాజమహేంద్రవరం

ఆశాజనకంగా..

- వర్జీనియా పొగాకు కిలో సగటు ధర రూ.295
- గరిష్ఠ ధర రూ.332
- భవిష్యత్తులో మరింతగా పెరగనున్న ధర
- వేగం పుంజుకున్న కొనుగోళ్లు
- ఇప్పటి వరకూ 20.15 మిలియన్ల కిలోల విక్రయం

దేవరపల్లి: వర్జీనియా పొగాకు మార్కెట్ రైతులకు సంతృప్తినిస్తోంది. మార్కెట్లో ధరలు ఆశాజనకంగా ఉండడంతో కొనుగోళ్లు వేగం పుంజుకున్నాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో దాదాపు 40 రోజుల పాటు కొనుగోళ్లు మందకొడిగా జరిగినప్పటికీ మే నెలలో ఊపందుకున్నాయి. మార్కెట్లో మంచి ధర పలకడంతో రైతులు వేలం కేంద్రాలకు తీసుకువచ్చే పొగాకు బేళ్ల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం వేలం కేంద్రాల్లో మీడియం, బ్రైట్ గ్రేడ్ పొగాకు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు మందగించాయి. దాదాపు నెల రోజుల నుంచి ట్రేడర్లు లో గ్రేడ్ పొగాకు కొనుగోలు చేయడం లేదు. దీంతో రైతులు బ్రైట్, మీడియం గ్రేడ్ పొగాకును వేలం కేంద్రాలకు తీసుకువచ్చి గిట్టుబాటు ధరకు అమ్ముకుంటున్నారు. కిలో గరిష్ఠ ధరతో పాటు సగటు ధర రైతులకు సంతృప్తికరంగా ఉంది. కిలో గరిష్ఠ ధర రూ.332, సగటు ధర రూ.295 చొప్పున లభిస్తున్నాయి. కొనుగోలు సంస్థలు కూడా మార్కెట్లో దూకుడు పెంచడంతో ధర ఆశాజనకంగా ఉందని అధికారులు అంటున్నారు. పొగాకు కొనుగోలుకు 30 సంస్థలు ఉండగా సుమారు 20 సంస్థలు వేలంలో పాల్గొంటున్నాయి. అంతర్జాతీయంగా వర్జీనియా పొగాకుకు డిమాండ్ ఏర్పడడం, ఎగుమతి ఆర్డర్లు రావడంతో మార్కెట్ ఆశాజనకంగా ఉందని అధికారులు చెబుతున్నారు. భవిష్యత్తులో ఈ ధర మరింత పెరుగుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కిలో రూ.350 వరకూ అమ్ముడుపోయే అవకాశాలున్నాయని అంటున్నారు. రెండు రోజులుగా వేలం కేంద్రాల్లో లో గ్రేడ్ పొగాకు కూడా కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. లో గ్రేడ్ పొగాకు కొనుగోళ్లు మరింతగా పెంచాలని కోరుతున్నారు. పొగాకు బోర్డ్ రాజమహేంద్రవరం రీజినల్ కార్యాలయం పరిధిలోని ఐదు వేలం కేంద్రాల్లో సోమవారం నాటికి 20.15 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయి. బోర్డు అధికారుల అంచనా మేరకు మరో 45 మిలియన్ల కిలోల పొగాకు కొనుగోలు జరగాల్సి ఉంది. ఇప్పటి వరకూ 1,65,137 బేళ్లు కొనుగోలు చేశారు.

పెరిగిన భూముల కౌలు, బ్యారన్ అద్దె

మార్కెట్లో పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో 2024–25 పంట కాలానికి రైతులు ఇప్పటి నుంచే భూములు, బ్యారన్లను కౌలుకు, లీజుకు తీసుకుంటున్నారు. వీటి ధరలు రెట్టింపు పలుకుతున్నాయి. గత ఏడాది ఎకరం భూమి కౌలు రూ.40 వేల నుంచి రూ.42 వేలు ఉండగా, వచ్చే ఏడాదికి రూ.60 వేల నుంచి రూ.72 వేల వరకూ పలుకుతోంది. బ్యారన్ లీజు గత ఏడాది రూ.80 వేలు ఉండగా రూ.లక్ష నుంచి రూ.1.80 లక్షల వరకూ పలుకుతుందని రైతులు అంటున్నారు. అయినప్పటికీ రైతులు పోటీపడి మరీ భూములను కౌలుకు, బ్యారన్లను లీజుకు తీసుకుంటున్నారు. వచ్చే ఏడాది సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. బ్యారన్ ఖరీదు రూ.7 లక్షల నుంచి రూ.8 లక్షల వరకూ పలుకుతోంది. రెండేళ్ల క్రితం ఇది రూ.2.50 లక్షలు మాత్రమే ఉండటం గమనార్హం.



దేవరపల్లి వేలం కేంద్రంలో పొగాకు కొనుగోలు చేస్తున్న ట్రేడర్లు

వేలం కేంద్రాల వారీగా విక్రయాలు, సగటు, గరిష్ఠ ధర

వేలం కేంద్రం	గరిష్ఠ ధర (కిలో రూ.)	సగటు ధర (కిలో రూ.)	విక్రయాలు (కిలోల్లో..)
దేవరపల్లి	332	305.00	31,22,557
గోపాలపురం	332	300.35	40,49,132
జంగారెడ్డిగూడెం–1	331	290.48	44,73,551
జంగారెడ్డిగూడెం–2	331	293.86	44,42,571
కొయ్యలగూడెం	331	292.97	40,68,559



పనస... బరువెంతో తెలుసా!



అంబాజీపేటలో 75 కిలోల పనసకాయ

అంబాజీపేట: సాధారణంగా పనసకాయ బరువు 15 కిలోలు ఉంటేనే అమ్మో అంటాం. అలాంటిది ఏకంగా 75.200 కిలోలు ఉంటే అబ్బురమే. పి.గన్నవరం యర్రంశెట్టివారిపాలెంలో అడబాల రంగారావు తోటలో ఇంత బరువుతో పనస కాయ కాసింది. దానిని అంబాజీపేట మార్కెట్‌కు తీసుకెళ్లగా అంతా ఆశ్చర్యంగా తిలకించారు. ప్రస్తుతం శుభకార్యాలు లేకపోవడంతో ధర తక్కువే పలికింది. అదే పెళ్లిళ్ల సీజన్‌లో అయితే ఈ పనసకాయను రూ.5 వేలకు పైబడి కొనుగోలు చేస్తారని వ్యాపారి కుంపట్ల నాగేశ్వరరావు తెలిపారు.

చితికిపోయిన జీవితాలు



స్వామినాథన్ (ఫైల్) రాధా ప్రియ (ఫైల్) రాకేష్ (ఫైల్) గోపి (ఫైల్)



కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

- కృష్ణా జిల్లాలో కొవ్వూరు వాసుల మృతి
- రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం
- స్వామినాథన్ మృతితో స్థానికుల దిగ్భ్రాంతి

కొవ్వూరు: ఆ కుటుంబం ఊరుకాని ఊరుకి వ్యాపారం నిమిత్తం వచ్చింది.. అనుకోని ప్రమాదం ఆ కుటుంబాన్నే చిదిమేసింది.. సోమవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై కృష్ణా జిల్లా బాపులపాడు మండలం కోడూరుపాడు వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం చెందగా, మరొకరు ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నారు. మృతులు తమిళనాడుకు చెందిన వారు కాగా, వీరిలో కొందరు కొవ్వూరులో వ్యాపారం నిమిత్తం స్థిరపడ్డారు. ఈ ప్రమాదంలో కొవ్వూరులో స్థిరపడిన తమిళనాడు వాసి స్వామినాథన్‌తో పాటు మరో ముగ్గురు మృత్యువాత పడడం ఇక్కడి వారిని కలచివేసింది. ఆ వివరాల్లోకి వెళ్తే.. తమిళనాడులోని దిండిగల్ జిల్లా వేదసంతూర్ స్వామినాథన్ సొంతూరు. ఇరవై ఏళ్ల కిందట ఫైనాన్స్ వ్యాపారం నిమిత్తం తమిళనాడు నుంచి వచ్చి కొవ్వూరులో స్థిరపడ్డారు. పట్టణం 21వ వార్డు పరిధి చిన వేంకటేశ్వరస్వామి గుడి వీధిలో వారు నివాసం ఉంటున్నారు.

అయితే తన ఇద్దరు పిల్లలను తమిళనాడులోనే చదివిస్తున్నారు. వేసవి సెలవులు రావడంతో పిల్లలు ఇద్దరూ, సోదరుడి కుమారుడు కొవ్వూరుకు వచ్చారు. తిరిగి తమిళనాడులో వారిని విడిచిపెట్టేందుకు, ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు కుటుంబ సభ్యులతో కలసి కారులో స్వామినాథన్ బయల్దేరారు. వేగంగా కారును నడపటంతో అదుపు తప్పి కోడూరుపాటు వద్ద డివైడర్‌ను దాటుకుని అవతల వైపు రోడ్డులో ఎదురుగా వస్తున్న లారీని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న స్వామినాథన్ (40), అతని కుమార్తె రాధా ప్రియ (14), కుమారుడు రాకేష్ (12), సోదరుడి కుమారుడు గోపి (23) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. కారులో ప్రయాణిస్తున్న స్వామినాథన్ భార్య సత్య (38) తీవ్రగాయాలతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. స్వామినాథన్, అతని కుటుంబ సభ్యుల మరణవార్త విని కొవ్వూరులోని ఆయన సహచరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఒకే ప్రమాదంలో నలుగురు మృత్యువాత పడడంతో కలత చెందారు. చాలాకాలం నుంచి తమిళనాడు నల్లబొమ్మన్‌చెట్టి పరిసర గ్రామాలకు చెందిన సుమారు ఇరవై కుటుంబాలు కొవ్వూరు పరిసరాల్లో ఉంటున్నాయి.

ఈ ప్రమాద వార్త తెలుసుకుని స్వామినాథన్ ఇంటికి బంధువులైన అరుణ్‌కుమార్, వైదీశ్వరి, రేవతి తదితరులు చేరుకుని కన్నీటి పర్యంతం అయ్యారు. అలాగే స్థానిక మాజీ కౌన్సిలర్ పతివాడ రామారావు ప్రమాద వివరాలను తెలుసుకుని బాధితులకు ధైర్యం చెప్పారు.

మిర్చి ధర మరింత ప్రియం



పచ్చిమిరప తోట

- సెంచరీకి చేరిన కిలో ధర
- దిగుబడి తగ్గి ధర పైపైకి..



ఆలమూరు: పచ్చిమిర్చి ధర అధరహో అనిపిస్తుంది. మన ప్రతి వంటకంలో కచ్చితంగా ఉపయోగించే వీటి ధరల ఘాటు రోజురోజుకూ పెరుగుతుంది. కూరల్లో తప్పనిసరిగా వాడే మిర్చి ఆకాశానికి ఎగబాగడం వినియోగదారులకు ఆందోళన కలిగిస్తుంది. ఆలమూరు మండలం మడికి అంతర్రాష్ట్ర కూరగాయల మార్కెట్‌లో గత నెల రోజుల వ్యవధిలో పచ్చిమిర్చి ధర మూడు రెట్లు పెరిగింది. ఈ నెల ప్రారంభంలో కేజీ మిర్చి రూ.30 ఉండగా, దశల వారీగా ప్రస్తుతం రూ.100 చేరింది. పెరిగిన ధరలు భరించలేక మిర్చి లేని కూరలు తయారు చేసుకుంటున్నామని వినియోగదారులు అంటున్నారు. వాతావరణంలో మార్పుల కారణంగా ఈ ఏడాది మార్చి, ఏప్రియల్ నెలల్లో ఎండ తీవ్రత, మే నెలలో వర్షాలు కురవడంతో జిల్లాలో మిర్చి సాగు తీవ్రంగా దెబ్బతింది. జిల్లాలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాలైన ఆలమూరు, ఆత్రేయపురం, సీతానగరం, కపిలేశ్వరపురం మండలాలతో పాటు మెట్ట ప్రాంతాలైన జగ్గంపేట, ప్రత్తిపాడు తదితర మండలాల్లో పంట దిగుబడి పరిమితంగానే ఉంది. ఏటా వరదలు వెళ్లిన తరువాత కొత్త మిర్చి సాగు చేయడం ఆనవాయితీగా వస్తుంది. సాధారణంగా ప్రకృతి సహకరించి ఉంటే వరదలు సంభవించే వరకూ జూలై నెలాఖరు వరకూ జిల్లాలో పండుతున్న మిర్చి పంట స్థానిక అవసరాలకు సరిపడా ఉండేది. అప్పటి నుంచి పొరుగు రాష్ట్రమైన చెన్నై నుంచి కాని, మన రాష్ట్రంలోని గుంటూరు నుంచి కాని దిగుమతి జరుగుతుండేది. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు ధరల పెరుగుదలకు కారణమైంది. దిగుమతి చేసుకునే చెన్నై, గుంటూరు, ఖమ్మం తదితర ప్రాంతాల్లోని కొత్త పంట ఇంకా మొక్క దశలోనే ఉండటం వల్ల పెరిగిన ధరలు ఏమాత్రం తగ్గడం లేదు. మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి కొనసాగనుందని వ్యాపారులు అంటున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



నీలపల్లి వంతెన సమీపంలో గోదావరి వద్ద లభ్యమైన సతీష్ మృతదేహం

తాళ్లరేవు: మండలంలోని నీలపల్లి గ్రామానికి చెందిన గుత్తుల సతీష్ (30) అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన సతీష్ వడ్రంగి మేస్త్రిగా పనిచేస్తున్నాడు. అతను ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అంతా గాలించారు. అయితే సోమవారం ఉదయం నీలపల్లి వంతెన సమీపంలో ఆత్రేయ గోదావరి నదిలో సతీష్ మృతదేహం తేలుతూ కనిపించింది. కుటుంబానికి ప్రధాన ఆధారమైన అతని మృతితో కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అయితే ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి సమాచారం రాలేదని కోరంగి పోలీసులు తెలిపారు.

కపిలవాయికి వేదనిధి పురస్కారం



సచ్చిదానంద స్వామీజీ సమక్షంలో వేదనిధి పురస్కారం స్వీకరించిన కపిలవాయి రామశాస్త్రి సోమయాజి దంపతులు

అన్నవరం: రత్నగిరి వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం విశ్రాంత ప్రధాన వేద పండితుడు, బ్రహ్మశ్రీ కపిలవాయి రామశాస్త్రి సోమయాజికి మైసూరు అవధూత దత్తపీఠం తరఫున 'వేద నిధి' పురస్కారం ప్రదానం చేశారు. ఆదివారం సాయంత్రం అక్కడి దత్తపీఠంలో జరిగిన కార్యక్రమంలో మైసూరు అవధూత దత్తపీఠాధిపతి బ్రహ్మశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ సమక్షంలో ఈ పురస్కారాన్ని అందజేశారు. దత్తపీఠాధిపతి 82వ జన్మదినోత్సవంలో భాగంగా ఈ పురస్కారం అందజేసినట్లు కపిలవాయి రామశాస్త్రి సోమయాజి సోమవారం 'సాక్షి'కి వివరించారు. అన్నవరం దేవస్థానంలో రామశాస్త్రి సుమారు 40 ఏళ్ల వేద పండితుడిగా, వైదిక కమిటీ సభ్యుడిగా, ప్రధాన వేద పండితుడిగా వివిధ హోదాల్లో సేవలందించారు. మూడు సార్లు ఉత్తమ వేద పండితుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి వివిధ సందర్భాల్లో పురస్కారాలు పొందారు. వేద, స్మార్త విద్యా పరీక్షలు, వేద పండితుల ఉద్యోగ పరీక్షలు, ఇంటర్వ్యూ కమిటీలలో సభ్యుడిగా సేవలందించారు. ప్రస్తుతం సామవేదం కూడా అభ్యసిస్తున్నట్లు కపిలవాయి తెలిపారు. దత్తపీఠం తరఫున వేదనిధి పురస్కారం పొందడంపై ఆయనను స్థానిక వేద పండితులు అభినందించారు.

కారు ఢీ: వ్యక్తి దుర్మరణం

మరో ముగ్గురికి తీవ్రగాయాలు



కోలా సత్తిబాబు (ఫైల్)



సత్తిబాబు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు

గొల్లప్రోలు: కారు ఢీకొన్న ఘటనలో ఒకరు దుర్మరణం పాలవ్వగా, మరో ముగ్గురు తీవ్ర గాయాల బారిన పడ్డారు. గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కథనం ప్రకారం.. కరప మండలం అరట్లకట్ట గ్రామానికి చెందిన తాతీలు (35), అతని భార్య లోవకుమారి (32), కుమారుడు అఖిల్ (12)తో కలసి మోటారు సైకిల్‌పై అన్నవరం గ్రామంలో బంధువులు ఇంటికి సోమవారం సాయంత్రం బయలుదేరారు. ఈ నేపథ్యంలో చేబ్రోలులోని జాతీయ రహదారిపై ఆదర్శ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా వచ్చేసరికి కాకినాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్తున్న మారుతీ ఎర్టీగా కారు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆ ముగ్గురికీ తీవ్ర గాయాలయ్యాయి. అనంతరం ఆ కారు బైక్‌పై వెళ్తున్న చేబ్రోలుకు చెందిన కోలా సత్తిబాబు (56)ను ఢీకొంది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనలో క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో కాకినాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సత్తిబాబు మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జేసీబీ ఢీకొని వృద్ధురాలి మృతి

కొవ్వూరు: స్థానిక మెరకవీధిలో వినాయక గుడి సమీపంలో సోమవారం సాయంత్రం రోడ్డుపై నడిచి వెళ్తున్న యాదగిరి నూకాలమ్మ (70)ను జేసీబీ ఢీకొనడంతో దుర్మరణం పాలైంది. జేసీబీ వెనుక చక్రం ఆమె పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోలీసులు కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలు ఒకటో వార్డు పరిధిలోని శ్రీరామకాలనీ వాసిగా గుర్తించారు.

హైవేపై హైడ్రో క్లోరిక్ యాసిడ్ లీక్

- పొగతో ప్రయాణికుల ఇక్కట్లు
- తప్పిన పెను ప్రమాదం



ట్యాంకర్ నుంచి లీకవుతున్న హైడ్రో క్లోరిక్ యాసిడ్



తేటగుంట జంక్షన్‌లో నిలిచిపోయిన ట్రాఫిక్, ప్రయాణికులు

తుని రూరల్: తుని మండలం తేటగుంట శివారు పాత ఆర్టీఏ చెక్‌పోస్ట్ సమీపంలో జాతీయ రహదారిపై హైడ్రో క్లోరిక్ యాసిడ్ ట్యాంకర్‌ను గ్యాస్ సిలెండర్ లారీ ఢీకొనడంతో పెద్ద ఎత్తున యాసిడ్ పొగ అలముకుంది. సోమవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. రూరల్ ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం.. కొవ్వూరు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న యాసిడ్ ట్యాంకర్‌ను అదే రహదారిలో వస్తున్న గ్యాస్ సిలెండర్ల లారీ ఢీకొంది. ఈ సంఘటనలో ట్యాంకర్ పైపు ధ్వంసం కావడంతో యాసిడ్ లీకై హైవేపై దట్టమైన పొగ ఏర్పడింది. దీంతో వాహన రాకపోకలకు మూడు గంటలకు పైగా అంతరాయం ఏర్పడింది. యాసిడ్ పొగతో అటుగా వెళ్లొచ్చే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. తుని నుంచి అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని యాసిడ్ పొగను అదుపు చేశారు. ఈ విషయం తెలియడంతో రూరల్ ఎస్సై రమేష్‌బాబు, తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. అయితే సిలెండర్ల లారీ క్లీనర్ రెండు వాహనాల మధ్యలో చిక్కుకుని స్వల్పంగా గాయపడ్డాడు. యాసిడ్ పొగ నుంచి తప్పించుకునేందుకు ప్రయాణికులు రూమాళ్లను ముఖానికి మాస్క్‌లా కట్టుకోవాల్సి వచ్చింది. ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఆటహోసంగా..

- నాడు బాస్కెట్‌బాల్‌లో ప్రత్యేక తర్ఫీదు ఇచ్చిన పురుషోత్తం
- పలువురు జాతీయ, యూనివర్సిటీ పోటీలకు ఎంపిక
- 25 ఏళ్ల తరువాత అరుదైన ఆత్మీయ కలయిక



అంబాజీపేట ఉన్నత పాఠశాల బాస్కెట్‌బాల్ మైదానంలో 25 ఏళ్లనాటి క్రీడాకారిణులు, కోచ్ పురుషోత్తం

సాక్షి, అమలాపురం: ఆడే ప్రాంగణం ఎలా ఉంటే ఏముందీ.. గురువు ఇచ్చే శిక్షణలో మెళకువలు ఉంటే, ఆ శిష్యులకు పతకాల పంటే.. అందుకే కొబ్బరికి కేంద్రమైన అంబాజీపేట బాస్కెట్‌బాల్ క్రీడలో రాష్ట్ర స్థాయిలో అరుదైన గుర్తింపు సాధించింది. బాలికల బాస్కెట్‌బాల్‌లో ఈ గ్రామం నుంచి ఎంతోమంది విద్యార్థులు జాతీయ, యూనివర్సిటీ పోటీలకు ఎంపికై ఘనత సాధించారు. అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉన్న సాధారణ మట్టి కోర్టులో శిక్షణ పొందుతూ ఇప్పటి వరకూ ఐదుగురు జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున, నలుగురు యూనివర్సిటీ పోటీలకు ఆంధ్రా యూనివర్సిటీ జట్టు తరఫున, ఇంటర్ యూనివర్సిటీ పోటీలకు పది మంది ఎంపికై బాలికల బాస్కెట్‌బాల్‌లో తమకంటూ అరుదైన గుర్తింపు తెచ్చుకున్నారు. 2002 నుంచి 2005 మధ్యకాలంలో ఈ పాఠశాల నుంచి కళాశాలకు వెళ్లిన ముగ్గురు క్రీడాకారిణులు ఆంధ్రా యూనివర్సిటీకి ఎంపికయ్యారు. గతంలో పాఠశాల స్థాయిలో ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన జోన్, సెంట్రల్ జోన్ పోటీల్లో ఈ పాఠశాల జట్టు వరుసగా మూడేళ్ల విజేతగా నిలిచి మరో ఘనత సాధించింది. ఇలా గడిచిన 25 ఏళ్లుగా ఇక్కడ బాలికల బాస్కెట్‌బాల్‌లో ఎంతోమంది రాణిస్తున్నారంటే అందుకు పునాది వేసిన నాటి పాఠశాల ఫిజికల్ డైరెక్టర్, కోచ్, రిటైర్డ్ హెచ్ఎం కట్టా పురుషోత్తం అని చెప్పాల్సిందే. పాతికేళ్ల కిందట బాస్కెట్‌బాల్ పోటీల్లో శిక్షణ ఇచ్చిన పురుషోత్తం, అతని వద్ద శిక్షణ పొందిన క్రీడాకారిణులు 25 ఏళ్ల తరువాత మరోసారి అదే కోర్టులో సోమవారం కలిశారు. ఇదే పాఠశాలలో 1998–99 పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా వచ్చిన నాటి విద్యార్థులలో క్రీడాకారిణిలతోపాటు స్థానికంగా ఉన్నవారూ రావడంతో పాఠశాలలోని క్రీడా మైదానంలో సందడి నెలకొంది. నాటి క్రీడాకారుల అలనాటి ముచ్చట్లు, నాడు సాధించిన విజయాలు నెమరవేసుకున్నారు. అప్పట్లో జాతీయ స్థాయి పోటీలు, టోర్నీలకు వెళ్లేందుకు పడిన కష్టాలు.. సాధించిన గుర్తింపును ఒకరి ఒకరు గుర్తు చేసుకున్నారు. ఇతర జిల్లాల నుంచే కాకుండా సింగపూర్‌లో నివాసముంటున్న నాటి బాస్కెట్‌బాల్ క్రీడాకారిణి పార్వతి సైతం రావడం విశేషం.

కోర్టు నిర్మిస్తే మరింత చేయూత



సాధారణ మట్టి కోర్టులో శిక్షణ పొందుతూ ఇంతమంది జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం చిన్న విషయం కాదు. ఇక్కడ సిమెంట్ కోర్టు నిర్మిస్తే మరింత మంది జాతీయ పోటీలకు ఎంపిక వుతారు. ఇందుకు ప్రజాప్రతినిధులు, అసోసియేషన్లు, స్థానికులు సహకరించాలి. అప్పట్లో అంబాజీపేట బాలికల బాస్కెట్‌బాల్ జట్టు అంటే రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక గుర్తింపు ఉండేది. ఇప్పుడు మరోసారి ఆ గుర్తింపు రావడం, నా వద్ద శిక్షణ పొందిన శిష్యురాలు ఆదిలక్ష్మి ఇక్కడ పీడీగా పనిచేస్తూ బాస్కెట్‌బాల్‌లో పలువురికి శిక్షణ ఇవ్వడం చాలా సంతోషాన్ని ఇస్తోంది.

-కట్టా పురుషోత్తం, రిటైర్డ్ పీడీ, హెచ్ఎం, అమలాపురం

అపోలో ఫార్మసీలో దొంగతనం

రూ.90 వేల నగదు, మందుల చోరీ



షాపులో నగదు చోరీ చేస్తున్నట్లు సీసీ కెమేరాలో చిక్కిన దృశ్యం

సామర్లకోట: స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని అపోలో ఫార్మసీ మెడికల్ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. షాపు నిర్వాహకుల ఫిర్యాదు మేరకు సీఐ డి.సురేష్ సంఘటనా ప్రదేశానికి చేరుకుని వివరాలు సేకరించారు. శనివారం సాయంత్రం నుంచి ఆదివారం అమ్మకం సొమ్ము రూ.90 వేలు షాపులో ఉంచి షాపు తాళాలను యథావిధిగా వేయగా, సోమవారం ఉదయం షాపునకు వచ్చే సరికి తాళాలు పగులగొట్టి ఉన్నాయని నిర్వాహకులు తెలిపారు. సామర్లకోట-పెద్దాపురం రోడ్డులో నిత్యం జన సంచారం ఉండే ప్రదేశంలో షాపు తాళాలు పగులగొట్టి చోరీ చేయడంతో ప్రజలకు ఉలిక్కిపడ్డారు. షాపులోని నగదు రూ.90 వేలు, విలువైన మందులు చోరీకి గురైనట్లు గుర్తించారు. అయితే షాపులో సీసీ కెమెరా ఉండటంతో చోరీ జరిగిన సంఘటనలు స్పష్టంగా రికార్డు కావడంతో పోలీసులు ఆ పుటేజీలను సేకరించారు. సీసీ పుటేజీల ఆధారంగా ఇద్దరు వ్యక్తులు షాపులోకి చొరబడినట్లు గుర్తించారు. దొంగలు తమ వేలిముద్రలు పడకుండా చేతికి వస్త్రం చుట్టుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. ఇటీవల కాలంలో పట్టణంలో చోరీల సంఖ్య పెరుగుతుందని స్థానికులు వాపోతున్నారు.

ఇసుక తరలిస్తున్న లారీల స్వాధీనం

ముగ్గురిపై కేసు నమోదు



మద్దూరులంకలో స్వాధీనం చేసుకున్న లారీ, చిత్రంలో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు

కొవ్వూరు: మద్దూరులంక గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు టిప్పర్ ఇసుక లారీలు, రెండు లోడింగ్ ట్రాక్టర్‌లను స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ పోలీసులు సోమవారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. కాటన్ బ్యారేజీకి దిగువన గోదావరి నది నుంచి ఏ విధమైన అనుమతుల్లేకుండా ఇసుక సేకరించి నిల్వ చేసి లారీల్లో తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. 24 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. ఈ కేసులో సీతంపేట గ్రామానికి చెందిన నూకల ప్రసాద్, మద్దూరులంక గ్రామానికి చెందిన గోటేటి రాముడు, మసాబత్తుల వినోద్‌కుమార్‌లపై కేసు నమోదు చేయాలని రూరల్ పోలీసులకు సిఫార్సు చేశామన్నారు. లారీలు, లోడింగ్ ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించినట్లు వివరించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ కె.శ్రీనివాసరావు, వీఆర్వో గుంటూ వెంకటేశ్వర్లు, వీఆర్ఏ తొర్ల పాటి సతీష్‌కుమార్‌లతో పాటు ఎస్ఈబీ, రూరల్ పోలీసు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
VAIBHAV JEWELLERS
TUNI / PITAPURAM / KAKINADA
AMALAPURAM / RAJAMAHENDRAVAM
Executive - Promotion cum collection (10 No.s):
Inter/Graduate with 2-3yrs experience in collection / promote the business of the company in Finance, Real-Estate & Retail companies. 2 wheeler is must & should have valid driving licence.
✆70329 64432 / 91774 03020
email: recruitment@vaibhavjewellers.in

ADARSH COLLEGE OF ENGINEERING
(Approved by AICTE, New Delhi & Affiliated to JNTUK, Kakinada)
NH-216, CHEBROLU-533449, GOLLAPROLU MANDAL, KAKINADA, Kakinada Dist. A.P.
WANTED Applications are invited for the following posts
Asst. Prof / Assoc. Prof for CIVIL, CSE, ECE, EEE, MECH & ENGLISH
Lecturers for Diploma : CME, ECE, AIML & MECH
Programmers / Technician for CSE, ECE & MECH
Qualification, Experience as per AICTE Norms and Attractive Salary for deserved candidates, Mail your CV to : careers.adarsh@gmail.com
on / before : 02.06.2024
Cell : 97042 21666, 93900 81992

Gnana Saraswati Vidyanikethan (Gokavaram)
(Nursery to Class 10th) (IIT & NEET Foundation)
We invite applications from both experienced and fresh aspirants to work in our organisation. You can attend the interview followed by a demo from 28th May to 30th May from 9 am to 5 PM

Post	Subject	Salary
Teachers for IIT & Olympiad (6th to 10th)	Maths, Physics Chemistry	30,000 to 40,000/-
High School Teachers (6th to 10th)	All Subjects	20,000 to 30,000/-
Primary Teachers (Nursery to 5th)	All Subjects	15,000 to 20,000/-
PET's, & Non-Teaching Staff	Non-Academic	15,000 to 20,000/-

Interested candidates may attend the interview with their original Certificates.
For More Details GNANA SARASWATI VIDYA NIKETHAN, GOKAVARAM 77804 66511, 81433 86664, 9110 366 299

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

BUILDING FOR SALE
అంబాజీపేట మండలం, పుల్లేటికుర్రు హైస్కూల్ ప్రక్కన తూర్పు ఫేసింగ్ గల బిల్డింగ్ అమ్మబడును. ✆ : 94913 65599 [R-1151689]
రాజమండ్రి అర్బన్‌లో 33x40 సౌత్ పేసింగ్ బిల్డింగ్ అమ్మకమునకు కలదు. సంప్ర : 9515598648, 6303306691 [C-800251]

PLOT FOR SALE
రాజమండ్రిలో అత్యాధునిక వసతులతో మెగాగేటెడ్ కమ్యూనిటీ నందు ఇండివిడ్యువల్ & డూప్లెక్స్ విల్లాస్, ఓపెన్ ప్లాట్స్ అతి తక్కువ ధరలకే అమ్మకం. 90% బ్యాంక్ లోన్ కలదు. ✆ : 94919 13458 [R-942]

Services

GOLD FINANCE
బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 91699 22299

Wanted
కాకినాడ సిటీ కాలనీలో వాషింగ్ మిషన్ కవర్స్, గ్రైండర్, మిక్సీ, ఫ్రిడ్జ్ టాప్ కవర్స్ స్టిచింగ్ చేయుటకు లేడీ టైలర్స్ కావలెను. అనుభవం లేని వారికి ట్రైనింగ్ ఇవ్వబడును. వివరాలకు : 98490 71179, 95058 74250 [V- 6324]
మల్కిపురం ప్రముఖ హాస్పటల్ నందు నైట్ డ్యూటీ చేయుటకు నర్సింగ్ స్టాఫ్ పురుషులు కావలెను. ఆకర్షణీ యమైన జీతం. సంప్ర: 95151 07348 [P-779413]
ప్రముఖ కంపెనీలో పార్ట్‌టైమ్ మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500రూ. మీ పేరు, అడ్రస్, కాల్/వాట్సప్ చేయగలరు. 9502615217 [G-8898]
కష్టపడక్కర్లేదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీ/పురుషులు, ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్ + భోజనం. HYD. ఫోన్: 8317512135 [HA-153]
శ్రీ NRKA టెక్స్‌టైల్స్ రాజమండ్రిలో పని చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. డ్యూటీ 8 గం॥ జీతం: 7500 నుండి 12000 వరకు & PF, ESI, ఉచిత వసతి, సబ్సిడి భోజనం ఏర్పాటు సంప్ర॥ లాలాచెర్వు జంక్షన్. ✆ : 85009 91230 [R-508]
Wanted Male Class incharges and Marketing Executives. Qualification: Any Inter / Degree. Salary: 12,000/- Location: Rajahmundry. Contact: 9248733370 [G-5371]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్స్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.